సత్యవేడు ఎమ్మెల్యేకి షాక్



లైంగిక వేధింపుల ఆరోపణలపై టీడీపీ అధినేత తక్షణ చర్యలు

ఇదంతా కుట్ర అంటున్న ఆదిమూలం

మద్దతుగా నిలబడ్డ కుటుంబసభ్యులు

తిరుపతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):తనను లైంగికంగా వేధించారంటూ ఓ తెలుగు మహిళ నాయకురాలు చేసిన ఆరోపణల నేపథ్యంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని టీడీపీ నుంచీ సస్పెండ్ చేయాలని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశించారు. దీంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు పార్టీ నుంచీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.తెలుగు మహిళ నాయకురాలు చేసిన ఆరోపణలను అధినేత సీరియస్‌గా తీసుకున్నారు. అందులో నిజానిజాలు, ఆరోపణల వెనుక ఇతర కోణాలు వంటివి ఏవైనా వుంటాయా అన్న విషయం కూడా అధినేత పరిగణనలోకి తీసుకోలేదు. మహిళా నేత నుంచీ తీవ్ర ఆరోపణ రావడంతో వరద సహాయక చర్యల్లో నిమగ్నమై వున్నా కూడా ఆ అంశంపై దృష్టి సారించారు.సస్పెన్షన్‌కు ఆదేశించిన అధినేత ఆరోపణల గురించి పార్టీపరంగా అంతర్గత విచారణకు ఆదేశించారు.గురువారం ఉదయం నుంచీ సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ఈ అంశం వైరల్ అవుతుండడంతో జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆత్మరక్షణ ధోరణిలో పడ్డాయి. అంతలోనే అధినేత స్పందించిన తీరు శ్రేణులను తలెత్తుకునేలా చేసింది. నిజానికి ఆరోపణలతో పార్టీ గ్రాఫ్ తగ్గాల్సిన పరిస్థితుల్లో అధినేత నిర్ణయం సామాన్య జనంలో కూడా పార్టీ ఇమేజిని పెంచింది.

తొలుత వ్యతిరేకించి... తర్వాత సమర్థించి

ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన తెలుగు మహిళ నాయకురాలు గత ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు.టీడీపీ టికెట్ డాక్టర్ హెలెన్‌కు కాకుండా ఆదిమూలానికి ప్రకటించడంతో నిరసించిన ఆమె తర్వాత సమర్థించారు. తీరా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేయలేదని ఆదిమూలం నుంచే విమర్శలు ఎదుర్కొన్నారు. ఫలితాల తర్వాత ఎమ్మెల్యే వెంట నడిచారు. మూడు నెలలు కూడా గడవకనే అదే ఎమ్మెల్యే మీద లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. నాలుగైదు నెలల్లోనే పలు మలుపులు తిరిగిన ఈ వ్యవహారంలో కేంద్ర బిందువుగా మారిన ఆమెది కేవీబీపురం మండలం.2020లో అప్పటి సత్యవేడు టీడీపీ ఇంచార్జి జేడీ రాజశేఖర్ అనుచరురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె తర్వాత డాక్టర్ హెలెన్ వర్గంలో చేరారు.ఆదిమూలానికి టికెట్ ప్రకటించాక ఆయన తరపున ప్రచారం చేశారు.ఎన్నికల ఫలితాల తర్వాత ఎమ్మెల్యే వెంట కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చివరగా వారం కిందట కేవీబీపురంలో ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమానికి ఆమె గైర్హాజరయ్యారు. ఇలా వీరి రాజకీయ సంబంధాలు అనేక మలుపులు తిరిగాయి. ఈ నేపథ్యంలో ఆమె గురువారం అకస్మాత్తుగా హైదరాబాదులో మీడియా ఎదుట ఎమ్మెల్యేపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం కలకలం రేపింది.ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ చరిత్రలో ఓ ఎమ్మెల్యే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొనడం, పార్టీ నుంచీ సస్పెండ్ కావడం ఇదే తొలిసారి. ఈ ఘటన జిల్లాకు తలవంపులుగా మారిందనే చెప్పాలి.

అజ్ఞాతంలోకి ఎమ్మెల్యే ఆదిమూలం
ఆరోపణలు కుట్రేనన్న కుటుంబం

తెలుగు మహిళ నేత ఆరోపణల వ్యవహారంలో ముందస్తు సమాచారం వుందో లేదో గానీ బుధవారం రాత్రి నుంచే ఎమ్మెల్యే ఆదిమూలం అజ్ఞాతంలోకి వెళ్ళినట్టు సమాచారం. సాధారణంగా ఎమ్మెల్యే కదలికలు, పాల్గొనే కార్యక్రమాల గురించి నియోజకవర్గవ్యాప్తంగా ముఖ్య నాయకులందరికీ సమాచారం వుంటుంది. కానీ గురువారం ఉదయం నుంచీ ఆయన ఆచూకీ ఎవరికీ తెలియలేదు.పుత్తూరు శివార్లలోని నివాసంలోనూ ఎవరూ అందుబాటులో లేరు. కుటుంబీకులతో పాటు వ్యక్తిగత సిబ్బంది కూడా లేకుండా పోయారు. ఎవరి ఫోన్లూ పనిచేయలేదు. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళారన్న ప్రచారం జరిగింది.ఎమ్మెల్యే ఒక ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధితో మాత్రం ఫోన్‌లో మాట్లాడి తనపై కుట్ర జరిగిందంటూ వివరణ ఇచ్చారు.తనకేమీ తెలియదని, తనపై కుట్ర జరిగిందని ఆరోపించారు. ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేశారని, తాను తప్పు చేయలేదని ఎక్కడైనా ప్రమాణానికి సిద్ధమని స్పష్టం చేశారు. తన బిడ్డల సాక్షిగా ఆమె తెలుగు మహిళా నాయకురాలిగా మాత్రమే తెలుసునని, ఇతర పరిచయాలు లేవన్నారు. ఇటీవలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడిన రమేష్‌బాబుతో పాటు పార్టీలోని మునుస్వామి యాదవ్, గిరిబాబు, బాలరాజు తదితర నాయకులు పన్నిన కుట్రగా ఆరోపించారు. అయితే ఆచరణలో ఎవరికీ అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్ళిపోవడంతో ఆయన వాదన బలహీనంగా మారింది.సాయంత్రానికి కుటుంబీకులు అందుబాటులోకి వచ్చారు. ఎమ్మెల్యే ఆదిమూలం సతీమణి గోవిందమ్మ మీడియాతో మాట్లాడుతూ తన భర్త చాలా మంచివాడన్నారు. రాజకీయాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగిన తన భర్తను కొందరు కుట్రపన్ని ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిమూలం కుమారుడు, నారాయణవనం జడ్పీటీసీ సుమన్ కుమార్ మాట్లాడుతూ తన తండ్రికి టికెట్ రావడం ఇష్టంలేని టీడీపీలోని కొందరు వైసీపీ వాళ్ళతో చేతులు కలిపి కుట్రలు పన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేకి ఆరోగ్యం బాగాలేనందున చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని వ్యక్తిగత సిబ్బంది వెల్లడించారు. అంతకుమించి ఏ ఆస్పత్రి అన్న విషయం కూడా చెప్పలేదు. ఆ తర్వాత కుమార్తెలు, అల్లుడు కూడా ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఎప్పుడో జరిగినట్లున్న వీడియోను ఇప్పుడు ఎందుకు విడుదల చేశారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. కూతురు వయసున్న ఆమె ఆరోపణలు చేయడం వెనుక కొంతమంది టీడీపీ, వైసీపీ నాయకులున్నారని, వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు.కాగా ఎమ్మెల్యే సొంత మండలమైన బీముని చెరువులో మహిళలు ఆదిమూలానికి మద్దతు తెలిపారు.ఆదిమూలంపై ఆరోపణల వెనుక మాజీ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. ఎమ్మెల్యే పై ఆరోపణలు చేసిన మహిళ దిష్టిబొమ్మను దహనం చేశారు.



మీడియా ఎదుట ఆదిమూలం కుటుంబ సభ్యులు

సర్పంచ్ నుంచి ఎదిగి.. ఒక్కసారిగా దిగజారి

సత్యవేడు, సెప్టెంబరు 5 : రాజకీయ ప్రస్థానంలో సర్పంచ్ స్థాయి నుంచి ఒక్కొక్క మెట్టు ఎదిగి ఎమ్మెల్యే స్థాయికి చేరుకున్న ఆదిమూలం ఒక్కసారిగా అప్రతిష్ట పాలయ్యారు.1978లో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఆదిమూలం నారాయణవనం మండలంలోని తన స్వగ్రామం భీమునిచెరువు సర్పంచ్‌గా తొలిసారి 1980లో ఎన్నికయ్యారు. ఏకధాటిగా 15 సంవత్సరాలు సర్పంచ్‌గా కొనసాగారు. 1995 నుంచి 2006 వరకు వైస్ ఎంపీపీగా, జడ్పీటీసీగా ఎన్నికయ్యారు.2009 నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా సత్యవేడు నియోజకవర్గంలో నారాయణవనం కలవడంతో టీడీపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. తరువాత కాంగ్రెస్, వైసీపీలో కొనసాగారు. 2014 ఎన్నికల్లో సత్యవేడు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆదిమూలం 2019 ఎన్నికల్లో గెలుపొందారు. 2024 ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి పెద్దిరెడ్డితో విభేదించి వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలోకి చేరి టికెట్ సంపాదించారు.అయితే వైసీపీ ఎమ్మెల్యేగా ఐదేళ్ళ కాలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఆయన అక్రమ కేసులు పెట్టి వేధించారంటూ మెజారిటీ నాయకులు ఆయన అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో కొంతమంది టీడీపీ నాయకులు ఇండిపెండెంట్ అభ్యర్థి రమేష్‌బాబుకు పనిచేశారు.అయితే కూటమి ప్రభంజనంలో ఆదిమూలం గెలుపొందారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం తనను లైంగికంగా వేధించారని ఓ తెలుగు మహిళా నాయకురాలు ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వీడియో టేప్‌లను మీడియాకు ఇవ్వడంతో ఆయన అసలు రంగు బయటపడింది. దీంతో ఆయన ఒక్కొక్క ఇటుక పేర్చి కట్టుకున్న రాజకీయ మేడ పేకమేడలా ఒక్కసారిగా కుప్పకూలినట్లు అయిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సమసిపోని వ్యతిరేకత

ఆదిమూలం ఎమ్మెల్యేగా గెలిచి మూడు నెలలవుతున్నా కష్టపడిన నాయకులను, జెండా మోసిన కార్యకర్తలను విస్మరించి వైసీపీ వారికి మద్దతు ఇస్తున్నారని టీడీపీలోని ఓ వర్గం వాదిస్తోంది. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థికి పని చేసిన వారందరినీ చెరకురసం (ఇండిపెండెంట్ అభ్యర్థి గుర్తు చెరకు) తాగారని దూషిస్తూ పూర్తిగా పక్కన పెట్టారని సమాచారం. అయితే అదే సమయంలో వైసీపీ నాయకులతో పాత బంధాలు కొనసాగిస్తూ చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతున్నారని, సొంత పార్టీ నాయకులే ఆయనపై మీడియాకు ఎక్కారు.

ఘనంగా గురు పూజోత్సవం

• 72మంది ఉపాధ్యాయులకు సత్కారం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 5: గురువులతోనే మంచి సమాజ నిర్మాణం సాధ్యమౌతుందని కలెక్టర్ వెంకటేశ్వర్, పలువురు ప్రజా ప్రతినిధులు ఉద్ఘాటించారు.జిల్లాస్థాయి గురు పూజోత్సవ కార్యక్రమం తిరుపతిలోని తుడా కార్యాలయం వెనుక వున్న కచ్చపి ఆడిటోరియంలో గురువారం జరిగింది. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథులుగా తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథులుగా చంద్రగిరి ఎమ్మెల్యే నాని, పుత్తూరు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ప్రత్యేక ఆహ్వానితులుగా కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యతోపాటు సామాజిక విలువలు, నైతికత వంటి అంశాలపై పిల్లల్లో అవగాహన పెంచాలని సూచించారు.పిక్టోరియల్ విధానంలో బోధించాలని, కాన్సెప్చువల్ లెర్నింగ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఉపాధ్యాయులకు సూచించారు.మాతృభాషలో బోధిస్తే విద్యార్థులు ఆయా విషయాలను చక్కగా అర్థం చేసుకుంటారని పరిశోధనల్లో తేలిందని చెప్పారు.ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 72మంది ఉపాధ్యాయులను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.ప్రారంభంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీఈవో శేఖర్, ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, సీఎంఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఊరందూరు ఉపాధ్యాయుడికి

జాతీయ పురస్కారం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న సురేష్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. సాంఘికశాస్త్ర విభాగంలో సురేష్ పలు వినూత్న ఆవిష్కరణలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ పుస్తకాల రచన, పలు యాప్‌ల రూపకల్పన, డిజిటల్ తరగతులకు పాఠ్యాంశాల తయారు లాంటి అంశాల్లో ప్రశంసలు అందుకున్నారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో జరిగే ముఖాముఖికి సురేష్ హాజరు కానున్నారు.

ఎర్రచందనం

రూటు మారింది!

- చెన్నై నుంచి గౌహతికి తరలిస్తున్న 140 దుంగల సీజ్
- ఐదుగురు స్మగ్లర్లు, లారీ డ్రైవర్, క్లీనర్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్

తడ, సెప్టెంబరు 5 :చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై పట్టపగలు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. చెన్నై నుంచి ఎర్రచందనం అక్రమంగా రవాణా జరుగుతుందన్న సమాచారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందింది.సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ బృందం జాతీయ రహదారిపై నిఘా పెట్టింది.గురువారం మధ్యాహ్నం సమయంలో చెన్నై నుంచి తడ వైపు ఓ వేగనార్ కారు ముందు వెళ్తుండగా దాని వెనుకనే ఒక ఐసర్ కంటైనర్ లారీ వెళ్తుండటాన్ని గుర్తించి టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంట పడ్డారు.వేగంగా వెళ్తున్న లారీని, కారును తడ మండలం బోడిలింగాలపాడు మలుపు దాటిన తరువాత టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ముందుగా కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు.లారీలోని డ్రైవర్‌ను, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. కంటైనర్ లారీలో ముందుపక్క అట్ట బాక్స్‌లు వెనుక ఎర్రచందనం దుంగలు ఉండటం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చి అప్పటికప్పుడు అక్కడికక్కడే పంచనామా నిర్వహించారు. సుమారు 140 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నిమిషాల వ్యవధిలోనే అక్కడ నుంచి ఆ వాహనాలను, స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడ నుంచి తరలించుకువెళ్లారు. దీనిపై సీఐ సురేష్‌కుమార్‌రెడ్డిని వివరాల కోసం ప్రశ్నించగా ఆయన వివరాలు తెలిపేందుకు నిరాకరించారు.

చెన్నై వదిలి గౌహతికి వెళ్లడమా...?

చైనా, జపాన్ దేశాల్లో విపరీతమైన డిమాండ్ వున్న ఎర్రచందనాన్ని దశాబ్దాలుగా చెన్నైకి తరలించి అక్కడినుంచి ఇతర దేశాలకు స్మగ్లింగ్ చేస్తుంటారు.అయితే గురువారం పట్టుబడ్డ ఎర్రచందనం చెన్నై వదిలి గౌహతికి వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చైనా, జపాన్‌కే కాకుండా ఏ దేశానికి రవాణా అవుతోందా అని ఆరా తీస్తున్నారు.



ఎర్రచందనంతో పట్టుబడ్డ లారీ

హథీరాంజీ మఠం భూముల్లో

అక్రమ నిర్మాణాల తొలగింపు



ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్న అక్రమ నిర్మాణాలు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 5: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ విద్యుత్‌నగర్ సర్వే నెంబరు 364, 368/1లోని హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలను గురువారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులతో కలసి భారీ పోలీసు బందోబస్తు నడుమ ఎక్స్‌కవేటర్ల సాయంతో మఠం అధికారులు తొలగించారు. ఈ సర్వే నెంబర్లలో మఠానికి సంబంధించి దాదాపు 26 ఎకరాల భూమి వుంది.ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న శివానాయక్ తన అనుచరులతో ఈ భూముల్లో హథీరాంజీ బావాజీ మఠం పరిరక్షణ సమితి పేరుతో సంస్థను ఏర్పాటు చేసి.. హథీరాం బావాజీ ఆలయ నిర్మాణంతోపాటు పలు షెడ్లను నిర్మిస్తున్నారు.అమ్మవారి ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. అత్యంత ఖరీదైన మఠం భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్న సమాచారంతో కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవ తీసుకుని ఎస్పీతో మాట్లాడి అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, ఏఎస్పీ రవి మనోహరాచారి నేతృత్వంలో దాదాపు 10 ఎక్స్‌కవేటర్ల సాయంతో ఈ అక్రమ నిర్మాణాలను తొలగించారు.శివానాయక్ తన అనుచరులతో కలసి కూల్చివేతను అడ్డుకునేందుకు ప్రయత్నించారు.బంజారాల ఆరాధ్య దైవం హథీరాం బావాజీకి వేలకోట్ల ఆస్తులున్నా ఆలయాన్ని నిర్మించలేదన్నారు.తిరుపతిలో ఆలయాన్ని నిర్మిస్తుంటే ఎక్స్‌కవేటర్లతో కూల్చివేయడం అన్యాయమన్నారు.తనను ముందస్తుగా అరెస్ట్‌చేసి, దౌర్జన్యంగా నిర్మాణాలను తొలగించడం దారుణమన్నారు.

మఠం పేరుతో సంస్థ ఏర్పాటు చట్టరీత్యానేరం

హథీరాంజీ మఠానికి సంబంధం లేని వ్యక్తులు మఠం పేరుతో సంస్థను ఏర్పాటు చేయడం చట్టరీత్యానేరం. శివానాయక్, హరిప్రసాద్‌నాయక్, కిశోర్‌నాయక్ తమ అనుచరులతో కలసి విద్యుత్‌నగర్‌లోని మఠం భూముల్లో నిర్మాణాలను చేపట్టారు. పనులు ఆపేందుకు ప్రయత్నించగా మఠం సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. శివానాయక్ సంస్థపేరుతో గుడి నిర్మాణం కోసం బంజారా కులస్తులను మోసగించి, వారివద్ద డబ్బులు వసూలు చేయడంతోపాటు భూమిని కబ్జా చేసేందుకు మహంత్ అర్జున్‌దాస్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు దానపత్రంతో కోర్టులు, అధికారుల ద్వారా లబ్ది పొందేందుకు ప్రయత్నించారు. ఈభూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి ప్లాట్లని విక్రయించి.. సామాన్య ప్రజలను మోసం చేశారన్న సమాచారం ఉంది. దీంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. ప్రజలు కూడా మఠం భూములను కొని, మోసపోవద్దు.

- కేఎస్ రామారావు, హథీరాంజీ మఠం పరిపాలనాధికారి

బంగారుబల్లి కనిపించింది

తిరుమల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శేషాచలం కొండల్లో అరుదుగా కనిపించే బంగారుబల్లి గురువారం ముగ్గురు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ల కెమెరాలకు చిక్కింది. పక్షుల ఫొటోలు తీయడానికి తిరుపతి సమీపంలోని కళ్యాణి డ్యాం అటవీ ప్రాంతంలో తిరుగుతున్న ఫొటోగ్రాఫర్లు కార్తీక్‌సాయి, ఐనేష్ సిద్దార్థ, గోపి లక్కల దీనిని చూసి క్లిక్‌మనిపించారు. అంతరించిపోతున్న బంగారుబల్లి పశ్చిమ కనుమల్లో ప్రధానంగా తిరుమల కొండల్లో లోతట్టు ప్రాంతాల్లో మాత్రమే సంచరిస్తుంటుంది. మూడు దశాబ్దాల కిందట బి.వి. రమణ బంగారు బల్లిని ఫొటో తీయగా, రెండేళ్ల కిందట కార్తీక్ సాయి దీన్ని కెమెరాలో చిత్రించారు. ఇప్పుడు మళ్లీ కళ్యాణిడ్యాం ప్రాంతంలో బంగారుబల్లి దర్శనమిచ్చింది.



శాస్త్రోక్తంగా వరాహస్వామి జయంతి

తిరుమల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆది వరాహ క్షేత్రమైన తిరుమలలోని భూవరాహస్వామి ఆలయంలో గురువారం ఉదయం వరాహ జయంతి శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై ద్విచక్రవాహనదారులకు అవగాహన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]


ద్విచక్రవాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ

తిరుమల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్లలో హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనదారులకు గురువారం తిరుమల పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమలకు వెళ్లే భక్తుల్లో చాలా మంది ద్విచక్ర వాహనదారులు అలిపిరి చెక్‌పాయింట్ వరకే హెల్మెట్ ధరించి ఆ తర్వాత తొలగించేస్తున్నారు. జీఎన్సీ టోల్‌గేట్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంటోంది. దీనిపై ఆంధ్రజ్యోతి ఆగస్టు 26న 'హెల్మెట్ ఏదీ గోవిందా..!' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. దీంతో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ విజయ్‌శేఖర్, ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్ద గురువారం తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ వినియోగించకుండా వచ్చినవారితో పాటు మరికొంతమంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరద బాధితులకు టీటీడీ ఉద్యోగుల సహాయం


ఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

తిరుమల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మేము సైతం అంటూ టీటీడీ ఉద్యోగ సంఘాలు ముందుకు వచ్చాయి. ఆర్థిక సహాయంగా ఒక్కరోజు మూలవేతనాన్ని ఇవ్వాలని టీటీడీలోని అన్ని ఉద్యోగ సంఘాలు నిర్ణయించుకున్నాయి. ఈమేరకు 2024 సెప్టెంబరు నెలలో ఒకరోజు మూలవేతనాన్ని రికవరీ చేసి సీఎం సహాయనిధికి అందించేందుకు అనుమతి ఇవ్వాలంటూ గురువారం టీటీడీ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఈవో శ్యామలరావును కలిసి వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు గోల్కొండ వెంకటేశం, గంపల వెంకటరమణారెడ్డి, ప్రసాదరావు, భాస్కర్, రామచంద్ర, వాసు నాగార్జున, ఆంజనేయులు, ముని వెంకటరెడ్డి, ఇందిరా, కల్పనా, ఆర్కే. భట్టా, రవికుమార్, నైనార్ పద్మనాభం, శైలేంద్ర, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట, సెప్టెంబరు 5: యువత హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలని చిన్నగొట్టిగల్లు జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ నాగరాణి అన్నారు. 'కోర్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీధర్, ఏఎన్ఎంలు హసీనా, శైలజ, మేఘన, విద్యార్థులు పాల్గొన్నారు.

మైక్రో ఇరిగేషన్ రైతులను 'ఈ-పంట'లో నమోదు చేయండి

భాకరాపేట, సెప్టెంబరు 5: రైతులు వేసిన పంటలతోపాటు మైక్రో ఇరిగేషన్ వివరాలను 'ఈ-పంట' యాప్‌లో నమోదు చేయాలని జిల్లా మైక్రోరిగేషన్ అధికారి సతీశ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి అన్నారు. సేవా కేంద్రంలో ఈ-పంట నమోదుపై గురువారం వారు సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు మామిడి, టమోటా వంటి పంటల సాగు వివరాలు నమోదు పూర్తి చేయాలన్నారు. సమీపంలోని టమోటా సాగును, దానికి ఉపయోగించిన డ్రిప్ పద్ధతిని పరిశీలించారు. ఉద్యాన శాఖాధికారిణి శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు ప్రారంభం

పాకాల, సెప్టెంబరు 5: మండలంలోని మొగరాల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను ప్రారంభించారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు ఈకార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి పౌష్టికాహారం గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించి, ఆకుకూరలు, కూరగాయలు, మిల్లెట్స్ ఉపయోగాల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు దయానంద, ఉపాధ్యాయులు జ్యోతి, ఆశా అంగన్‌వాడీ కార్యకర్తలు షమీమ్, మోహన, ధనలక్ష్మి, రేఖ, పుష్ప, ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రపరిశీలన


ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తిరుచానూరు, సెప్టెంబరు 5: తిరుపతి రూరల్ మండలం వేమూరులో దామా అయ్యప్ప నాయుడు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయాధికారులు పరిశీలించారు. రైతు భూమిని తక్కువగా దున్నడం, పంట వ్యర్థాలతో భూమిని కప్పి ఉంచడం, ఏటీఎం మోడల్, పట్టుపురుగుల పెంపకం, దేశీయ ఆవులు, ప్రకృతి వ్యవసాయంలో చీడపీడల నివారణకు ఉపయోగించే కషాయాల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగం, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక ఆలయ కుంభాభిషేకం


ఆలయానికి సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, సెప్టెంబరు 5: చంద్రగిరి మండలం, కొత్త శానంబట్లలో నిర్మించిన వినాయకస్వామి ఆలయ కుంభాభిషేకం మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని స్వామివారికి సారె తీసుకొచ్చారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు ముడిపల్లె సురేష్‌రెడ్డి, అత్తూరు తులసేశ్వరరెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సతీమణి లక్ష్మి ఆలయానికి సారె తీసుకొచ్చారు.

దోమల నివారణ మందు పిచికారి


కాలువల్లో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్న సిబ్బంది

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 5: నగరంలో ఇటీవల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ ప్రబలుతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ నివారణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి డివిజన్‌లో ముగ్గురు చొప్పున పారిశుధ్య సిబ్బంది ద్వారా ప్రత్యేక యంత్రాలతో క్రిమిసంహారక మందును పిచికారీ చేయిస్తోంది. ప్రతి వీధిలోని కాలువలు, ఇళ్లమధ్య దుర్గంధ స్థలాలు, రొచ్చు ప్రాంతాలు, పచ్చికలపై ఈ మందులను పిచికారీ చేస్తున్నారు.

పొన్నూరు నగలు గాదంకిలో దొరికాయి

- ఇద్దరు నిందితులు సహా రూ.30 లక్షల ఆభరణాల స్వాధీనం


పట్టుబడిన నిందితులు


పొన్నూరు పోలీసులకు ఆభరణాలు అప్పగిస్తున్న చంద్రగిరి పోలీసులు

చంద్రగిరి, సెప్టెంబరు 5: గుంటూరు సమీపంలోని పొన్నూరు పట్టణంలో ఉన్న ఓ వెండి దుకాణంలో భారీ చోరీ జరిగింది. వీరిలో ఇద్దరు నిందితులను గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారవగా, కారుతోపాటు రూ.30లక్షల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నూరు పట్టణం గాంధీబొమ్మ సెంటర్‌కు సమీపంలోని తోటలమ్మ గుడి పక్కనే వెండి, బంగారు ఆభరణాలు విక్రయించే ధనలక్ష్మీ జ్యూవెలర్స్ ఉంది. బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఓ కారులో కొందరు వ్యక్తులు వచ్చి దుకాణం షట్టర్ పగలగొట్టి లోనికి చొరబడ్డారు. అనంతరం ఆభరణాలను మూటలు కట్టి కారులో వేస్తుండగా, ఆ వీధిలో వినాయక చవితి పండుగకు పందిళ్లు వేస్తున్న కేజీఎన్ యూత్ సభ్యులు గమనించారు. యువకులు దుకాణం వద్దకు వెళ్లడంతో దుండగులు పారిపోయేందుకు యత్నించారు. యువకులు ధైర్యంచేసి వెంటాడి రతన్ సింగ్ అనే దుండగుడిని పట్టుకున్నారు. ఇతడిని విడిపించడానికి ఇద్దరు దుండగులు కారు దిగి వచ్చారు. యువకులపై దాడి చేయగా, వారు ప్రతిఘటించడంతో పరారయ్యారు. సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టుబడ్డ రతన్ సింగ్‌ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిచ్చిన సమాచారంతో కారు దిగిన ఇద్దరు నిందితులను తెనాలిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల సెల్‌ఫోన్ ఆధారంగా కారులో పరారైనవారు బెంగళూరుకు వెళుతున్నట్లు గుర్తించి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో వెళ్లి గాదంకి టోల్‌ప్లాజా వద్ద నిఘా ఉంచారు. నిందితులు ప్రయాణిస్తున్న కారు గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో రాగానే టోల్‌ప్లాజా సిబ్బందితో కలిసి వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. కారును పరిశీలించగా, రూ.30 లక్షల విలువైన వెండి ఆభరణాలు కనిపించాయి. కారుతోపాటు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను, కారు, ఆభరణాలను చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పొన్నూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు గురువారం రాత్రి 10 గంటల సమయానికి చంద్రగిరికి చేరుకున్నారు. వీరికి ఇద్దరు నిందితులు, ఆభరణాలు, కారును చంద్రగిరి పోలీసులు అప్పగించారు.




వేదికపై మాట్లాడుతున్న ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు - శ్రీపద్మావతి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

విద్యాసంస్థల్లో ఘనంగా గురు పూజోత్సవం



ప్రిన్సిపాల్‌కు చిరు బహుమతిని అందజేస్తున్న విద్యార్థి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 5: నగరంలోని పలు విద్యాసంస్థల్లో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను సన్మానించారు.

- టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో అధ్యాపకులను సన్మానించారు. అధ్యాపకులు ప్రియవర్ధన్‌బాబు, వార్డెన్ శ్రీనివాసులు నాయుడు, డిప్యూటీ వార్డెన్ సోమశేఖర్, పి.ప్రసాద్, కె.కిశోర్, చెన్నారెడ్డి, ప్రసన్నలక్ష్మి, వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.
- శ్రీపద్మావతి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు అధ్యాపకులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు అధ్యాపకులను సత్కరించి చిరు బహుమతులు అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు.

స్విమ్స్, ఎస్వీ వైద్య కళాశాలల్లో...

తిరుపతి(వైద్యం): స్విమ్స్‌లో డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో గురువుల ప్రాముఖ్యత, వారిని గౌరవించాల్సిన అవశ్యకతపై వైద్య విద్యార్థులకు వివరించారు. అనంతరం పలువురు వైద్య అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వైద్య విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

మార్కొండయ్య నాయుడు ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎన్ఆర్ కమ్మపల్లి పాఠశాల హెచ్ఎం సుగుణతో పాటు పరమాల స్నేహలత, మిట్టకండ్రిగ అరుణ, పిళ్లారికోన మనోహర్, కమ్మకండ్రిగ లోకేష్‌బాబు, బలిజపల్లి సులోచన, వెంకట్రామాపురం తేజోవతిని సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఎంఈవో జయవేలు, హెచ్ఎం వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

కూతాటి వెంకటరెడ్డికి సత్కారం



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ ఆచార్యుడు, ఎస్కే యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కూతాటి వెంకటరెడ్డిని గురువారం సత్కరించినట్లు తిరుపతి బాలోత్సవ కమిటీ తెలిపింది. ఎస్వీనగర్‌లోని వెంకటరెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నడ్డినారాయణ, పయ్యావుల గురునాథం, నెల్లూరు మునిలక్ష్మి, డాక్టర్ రవీంద్ర, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

స్థానిక రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు కస్పా పద్మనాభం, శాంభోలు హరనాథ్‌లను శాలువ, జ్ఞాపికతో సత్కరించినట్లు సంస్థ అధ్యక్షుడు గోపీనాథ్ తెలిపారు. సంస్థ కార్యదర్శి కె.ఎన్. రాజ, చంద్రబాబు నాయుడు, పాడిబండ మురళి సుబ్రమణ్యం, జయంత్‌బాబు, కళావతి, కేశవ చౌదరి, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొని, ఉపాధ్యాయులను అభినందించారు.

దేశానికి రాజైనా గురువుకు శిష్యుడే


కొక్కిలిగడ్డ వాణికి సన్మానం

చంద్రగిరి, సెప్టెంబరు 5: దేశానికి రాజు అయినా ఎప్పటికీ గురువులకు శిష్యులే అని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులు బి.మాధవి(నారావారిపల్లె), కె.వాణి(కల్‌రోడ్డుపల్లె), ఎం.భారతిదేవి(రాయలపురం), డీ.శ్రీనివాసులు(నాగపట్ల), ఎన్.నిర్మల(తొండవాడ), కేబీ.ప్రకాష్(నరసింగాపురం), ఏ.లలితకుమారి(మిట్టపాలెం), ఎం.వనజ(మొరవపల్లె), డి.పాకీజ(చంద్రగిరి), టీసీ.బాలమురళీకృష్ణ(బండార్లపల్లె), హరికుమార్(చంద్రగిరి), శారద(చంద్రగిరి), గోపాలకృష్ణ(ఐతేపల్లె), రామకృష్ణ(దోర్నకంబాల)లను ఘనంగా సన్మానించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఉపాధ్యాయులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, ఎంపీడీవో బాలాజీనాయక్, ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, చంద్రగిరి సర్పంచ్ రూపామూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంబీయూలో...


తండ్రి విగ్రహానికి పూలమాల వేస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంబీయూలో నెలకొల్పిన తన తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయులు స్వర్గీయ మంచు నారాయణస్వామి నాయుడి విగ్రహానికి మోహన్‌బాబు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వీసీ, రిజిస్ట్రార్, డీన్లు, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మకండ్రిగలో...



రామచంద్రాపురం: కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో ఎంఈవో

తిరుచానూరులో...



తిరుచానూరు: తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మురళీకృష్ణ మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలలోని గురువులను సత్కరించుకోవడం అదృష్టమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ధనంజయ, సెట్విన్ మేనేజరు మోహన్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో...



పాకాల: పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అధ్యాపకులు మోహన్ బెహర, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు హరినాథ్ రెడ్డి, భరణీకుమార్, సరస్వతి, రామయ్య, ఆంజనేయులు, సుబ్రమణ్యంశెట్టి, శోభారాణి, సుజాతలను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మోహిద్దీన్ బాషా విద్యార్థులు అధ్యాపకులను సన్మానించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సీనియర్ అధ్యాపకులను గజమాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కె.ఎన్.తులసీరామన్, ప్రతినిధులు జయరామ నాయుడు, కుప్పుస్వామి నాయుడు, రామయ్య, ఆర్వీ ప్రసాద్, ఎస్.దామోదర నాయుడు, జి.వి.ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ పి.మునిప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


పద్మావతి వర్సిటీలో పురస్కారాలు స్వీకరించిన అధ్యాపకులు

పద్మావతి వర్సిటీలో....

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): అధ్యాపకులు బోధన, పరిశోధన రంగాల్లో అంకిత భావంతో పని చేయడంతోనే పద్మావతి యూనివర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని ఇన్‌చార్జి వీసీ ఉమ అన్నారు. వర్సిటీలో నిర్వహించిన సభలో అధ్యాపకులు శోభారాణి (జర్నలిజం), నిర్మల, సావిత్రి, సుజాత, విద్యావతి, హేమవతి, స్కాలర్ శాంతిప్రియకు అవార్డులను అందజేసి అభినందించారు. రిజిస్ట్రార్ రజని, డీన్ రజని, టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు కాత్యాయని, సీనియర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో....



ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు బెస్ట్ టీచర్ అవార్డును అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఈ తరం విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యతో పాటు విలువలు నేర్పాలని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. శ్రీనివాసా ఆడిటోరియంలో పలువురు అధ్యాపకులకు ఉత్తమ అధ్యాపక అవార్డులను అందజేశారు. దేవప్రసాదరాజు(ఫిజిక్స్), రాజేశ్వరమ్మ(తెలుగు), జయచంద్రరెడ్డి(కామర్స్), కేశవులురెడ్డి(కంప్యూటర్‌సైన్స్), విశ్వనాథరెడ్డి(సైకాలజీ), పద్మజ(కెమిస్ట్రీ), సుధాకరయ్య, జయసుబ్బారెడ్డి(గణితం), నాగలక్ష్మి(బోటనీ), అనూరాధ(హోంసైన్స్), రాజశేఖర్(జువాలజీ), శివశంకర్‌రెడ్డి(ఫిజికల్ ఎడ్యుకేషన్), సుందరవల్లి, సుమకిరణ్, శారద(ఇంగ్లీషు), భాస్కరరెడ్డి(ఆర్కియాలజీ), జానకిరామయ్య(సోషియాలజీ), శ్యాంమోహన్‌డేవిడ్‌రాజు(అడల్ట్ ఎడ్యుకేషన్), చరితాదేవి(వైరాలజీ), రాంప్రకాష్(హిందీ), అరుణ(లింగ్విస్టిక్స్) బెస్ట్ టీచర్ అవార్డులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఎర్రావారిపాలెం: మండలంలోని ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో ఎర్రావారిపాలెంలో ఘనంగా సన్మానించారు. మండలంలో పనిచేస్తున్న కె.సుబ్రమణ్యం(కుమ్మరపల్లె, వైవీపీక్రాస్), బి.కుమార్(కూరపర్తివారిపల్లె), బి.వెంకట్రమణ(నెరబైలు), పి.నాగేశ్వర(బోడేవాండ్లపల్లె), ఎస్.చాంద్‌బాషా(ఎల్లమంద), ఎన్.నరేంద్ర(మర్రిపాటివారిపల్లె), సి.రమేష్(మార్రిమాకులపల్లె), ఎ.ఝాన్సీ(వడ్డిపల్లె), పి.అప్పన్న(ఓఎస్ గొల్లపల్లె), కె.సుమలత(గంపలమాదిగపల్లె)లను సన్మానించి, వారి సేవలను కొనియాడారు. తహశీల్దార్ పరమేశ్వర స్వామి, ఎంఈవో బాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ సంఘ నాయకులు అంజిమేటి మల్లేశ్వర్, వెంకట్రమణ, మల్లెల సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.




శ్రీసాయిసుధాస్కూల్‌లో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డాక్టర్ సుకుమార్ తదితరులు


చెర్లోపల్లె జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


వ్యవసాయ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న ఏడీ తదితరులు

శ్రీసాయిసుధా స్కూల్‌లో...

తిరుపతిరూరల్: నలంద నగర్‌లోని శ్రీసాయి సుధాస్కూల్‌లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. డైరెక్టర్ డాక్టర్ సుకుమార్, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, మేనేజర్ పుష్ప, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు వనిత, శకుంతల, శారద, లక్ష్మి, రేఖ, అసిఫా, జయంతి, భువనేశ్వరి, శోభ, అనిషా, జీవ, మురళి, రాము, రెడ్డిసాయి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెర్లోపల్లె జడ్పీహెచ్ఎస్‌లో: చెర్లోపల్లె జడ్పీహైస్కూల్‌లో 1997-98 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల నేతృత్వంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు 50చైర్లు, ఒక కార్పెట్‌ని విరాళంగా అందించారు. ఉపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, శంకర్‌రెడ్డి, సుజనిరెడ్డి, పూర్వవిద్యార్థులు సుబ్రమణ్యం, కిరణ్, సాగర్, శంకర్, శాలిని, నీరజ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతవర్సిటీలో: జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్లు వి.సుజాత, సాయిబాబా ప్రసాద్‌లను సన్మానించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, ఎడ్యుకేషన్ హెడ్ కాదాంబిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో: ఎస్వీవ్యవసాయ కళాశాలలో రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ నరసింగరావు, డాక్టర్ మునీంద్ర నాయుడు, డాక్టర్ ఆర్‌పీ వాసంతిలను ఘనంగా సన్మానించారు. ఏడీ డాక్టర్ ఎంవీరమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలాన్ని బర్తరఫ్ చేయాలి



తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 5 : ఓ తెలుగు మహిళ బతుకును బజారుకీడ్చిన ఆదిమూలాన్ని సత్యవేడు ఎమ్మెల్యే పదవినుంచి బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు పి.సాయిలక్ష్మి(ఐద్వా), ఎస్.జయచంద్ర(డీవైఎఫ్ఐ), పి.హేమలత(రైతుసంఘం) డిమాండ్ చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ ఆదిమూలం చేసిన అఘాయిత్యం బహిర్గతం కావడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేసి వదిలి పెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. నేర ప్రవృత్తి కలిగిన ప్రజా ప్రతినిధులకు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడే వారికి ఏ పార్టీ కూడా సీట్లు ఇవ్వరాదని వారు కోరారు. నరేంద్ర, జయంతి, లలితమ్మ, కోమలమ్మ, సంధ్య, మహాలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎటుచూసినా చెత్తకుప్పలే..!




తిరుపతి(మధురానగర్), సెప్టెంబరు 5: లీలామహల్ సర్కిల్ నుంచి దేవేంద్ర థియేటర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మధురానగర్‌లో ఎటుచూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. వినాయక స్వామి ఆలయం నుంచి మధురానగర్ వెళ్లే రోడ్డు పొడవునా చెత్తకుప్పలు ఉన్నాయి. చేపల మార్కెట్ వద్ద కూడా ఇదే పరిస్థితి. కనీసం వారానికి రెండ్రోజులు కూడా పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై కొందరు మహిళలు పీజీఆర్ఎస్‌లో కమిషనర్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.



స్విమ్స్‌లో అనధికారిక కూల్‌డ్రింక్స్ షాప్

అమ్మకాలను అడ్డుకున్న టీటీడీ విజిలెన్స్ సిబ్బంది - లైసెన్స్ ఉందంటూ వాగ్వాదానికి దిగిన నిర్వాహకులు

తిరుపతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి ఆస్పత్రి ఎదుట గురువారం అనధికారికంగా కూల్‌డ్రింక్స్ షాపును తెరవడంతో వివాదం చెలరేగింది. అనుమతులు లేకుండా షాపును ఎలా ప్రారంభిస్తారని నిర్వాహకులను తొలుత స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించారు. అయినా వారు పట్టించుకోకుండా షాపు తెరవడంతో టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్విమ్స్‌కు చేరుకున్న విజిలెన్స్ సిబ్బంది షాపు నిర్వాహకులను లైసెన్స్ కాపీలు అడిగినట్టు తెలిసింది. వారు చూపించకపోవడంతో కూల్ డ్రింక్స్ అమ్మకాలు చేపట్టకూడదని గట్టిగా హెచ్చరించినట్టు సమాచారం. ఇంతలో టీటీడీ తీర్మానం కాపీని బయటపెట్టడంతో బుక్స్, జెరాక్స్ కోసమని షాపు కేటాయించినట్టుగా గుర్తించినట్టు తెలియవచ్చింది. దీంతో కూల్‌డ్రింక్స్ తీసివేయాలని హెచ్చరించినట్టు తెలిసింది.

గత వైసీపీ ప్రభుత్వంలో వెలసిన షాప్

సార్వత్రిక ఎన్నికల ముందు గత వైసీపీ ప్రభుత్వంలో స్విమ్స్-శ్రీపద్మావతి ఆస్పత్రి ఎదుట హడావుడిగా షాపు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. టీటీడీ ధర్మకర్తల మండలి చివరి రెండు సమావేశాల్లో వైసీపీ నేత అనుయాయులకు పెద్దఎత్తున షాపుల షిఫ్టింగ్ ప్రక్రియకు తెరలేపారు. ఇందులో భాగంగా నగరంలో టీటీడీకి చెందిన ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో అప్పటి ఓఎస్డీకి ఓ స్టేషనరీ షాప్ ఉన్నట్టు తెలిసింది. టీటీడీ ఓఎస్డీ హోదాలో ఉన్నప్పటికీ పార్టీ ప్రచారాల్లో విరివిగా కనిపిస్తూ అప్పటి వైసీపీ నేతలను ప్రసన్నం చేసుకున్నారు. దీంతో ఎక్కడో షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న షాపును పద్మావతి ఆస్పత్రి వద్దకు మార్చుచేస్తూ.. టీటీడీ పాలకమండలిలో తీర్మానం చేశారు. ఎన్నికలకు ముందు వెంటవెంటనే జరిగిన పాలకమండలి సమావేశాల్లో ఆరుగురికోసారి, 14 మందికోసారి షాపుల షిఫ్టింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. అయితే ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ మొదలవ్వడంతో తీర్మానం వరకే షిఫ్టింగ్ ప్రక్రియ ముగిసింది. ఎన్నికలయ్యాక ఎలాగూ మనమే గెలుస్తామన్న ధీమాతో మిగిలిన తంతు చేస్తామని నాయకులు హామీలిచ్చి వారిని ఎన్నికల ప్రచారంలో వాడుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ పద్మావతి ఆస్పత్రి వద్ద మాత్రం షాపు నిర్మాణం చకచకా జరిగిపోయింది. ఓఎస్డీగా ఉన్న షాపు యజమానికి వైసీపీ నేతలతో ఉన్న పరిచయం వలన ఓ జేఈఓకూడా షాపు నిర్మాణంతోపాటు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుచేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్టు తెలిసింది. ఎన్నికల ఫలితాల తర్వాత మొత్తం తారుమారు కావడంతో కొంతకాలం వేచిచూసి.. షాపును ప్రారంభించారు. ఎన్నికలకు ముందు టీటీడీ తీసుకున్న నిర్ణయాలపై పునఃసమీక్షించాలన్న అధికారుల నిర్ణయంతో మూసివేయించారు. తీరిగ్గా మళ్లీ గురువారం షాపు ప్రారంభం కావడంతో వివాదం రేగింది. దీనిపై టీటీడీ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి వుంది.




యోగ 'ముని'



నడిరోడ్డులో యోగాసనాలు వేస్తున్న ఈయన పేరు మునీంద్ర భగత్. జార్ఖండ్ వాసి. యోగా గురువు. గురుపూజోత్సవం రోజున తిరుపతి నగరంలోని పలు కూడళ్లలో ఇలా యోగ విన్యాసాలను ప్రదర్శించారు. కార్లు, బైకులు, బస్సులు, ఆటోలూ అటూ ఇటూ దూసుకుపోతున్నా ఆయన యోగాసనాలను ఆటంకపరచలేకపోయాయి. పద్మ, గరుడ, శీర్ష, చక్ర, మయూర వంటి ఆసనాలను వేస్తున్న అరవై ఏళ్ల మునీంద్ర భగవత్‌ను అందరూ ఆసక్తిగా చూశారు. యోగా పుట్టిన భారతదేశంలో ప్రజలకు అవగాహన కలిగించడానికే ఇలా చేస్తున్నానని ఆయన అంటున్నారు. పదిహేనేళ్ల కిందట ఇల్లొదిలేసిన ఆయన అనేక నగరాలను సందర్శిస్తూ మూడు నెలల కిందట తిరుపతికి చేరుకున్నారు. భారతీయ ప్రజల జీవనశైలిలో యోగా భాగం అని ప్రచారం చేయడానికే ఇలా నడిరోడ్డుమీద ఆసనాలు ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నగరంలో రౌడీషీటర్ల ఆగడాలు

పరసాల వీధిలో కత్తులతో వీరంగం - ఇద్దరు రౌడీషీటర్లపై కేసు నమోదు



సాయికృష్ణ - పార్థసారథి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 5: నగరంలో రౌడీషీటర్ల ఆగడాలు పెరిగిపోతున్నాయి. బుధవారం రాత్రి కూడా ఓ సంఘటన జరిగింది. తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పరసాల వీధిలో ఉంటున్న రౌడీషీటర్ పార్థసారథి కొన్నేళ్లుగా జనసేన నాయకుడిగా చెలామణి అవుతున్నాడు. దాదాగిరి చేయడం.. గంజాయి టానిక్ తాగడం.. రౌడీయిజం చేసేవాడు. మరోవైపు ఇదే వీధిలో ఉంటున్న మరో రౌడీషీటరు సాయికృష్ణ వైసీపీకి చెందిన తన సోదరి మధుబాల గ్రంథాలయ చైర్మన్‌గా ఉండడంతో ఇతని దౌర్జన్యాలకూ పగ్గాలు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో పరసాల వీధిలో తనదే పైచేయిగా ఉండాలని పార్థసారథి భావించి.. సాయికృష్ణపై పెత్తనం చెలాయించేవాడు. ఇది గిట్టని సాయికృష్ణ ఎలాగైనా పార్థసారథిని హతమార్చాలని భావించాడు. బుధవారం రాత్రి ఇద్దరూ పూటుగా గంజాయి టానిక్‌తోపాటు మద్యం తాగి మాటల యుద్ధానికి దిగారు. మత్తులో ఇద్దరూ నడిరోడ్డులో జనం ముందే కత్తులతో వీరంగం చేశారు. అనంతరం పార్థసారథి ఇంటికెళ్లి ఆయన భార్యను సాయికృష్ణ దూషించాడు. సమాచారం అందుకున్న వెస్ట్ పోలీసులు అక్కడకు చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. పార్థసారథిపై హత్యాయత్నం కేసు, సాయిపై అసభ్య పదజాలంతో దూషించాడన్న కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

10న సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి వర్ధంతి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5: అన్నమాచార్య కళామందిరంలో ఈనెల పదో తేదీన ఉదయం సాధుసుబ్రహ్మణ్య శాస్త్రి వర్ధంతిని, సాయంత్రం గౌరిపెద్ది రామసుబ్బశర్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. హిందూ ధార్మిక ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఇందులో భాగంగా ఆ రోజున ఉదయం 9గంటలకు ఎస్వీ ప్రాచ్య కళాశాలలో గౌరిపెద్ది రామసుబ్బ శర్మ విగ్రహానికి, 9.30 గంటలకు శ్వేత కూడలిలోని సాధుసుబ్రహ్మణ్య శాస్త్రి విగ్రహానికి టీటీడీ అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు.

బస్టాండులో అధునాతన కెమెరాల ఏర్పాటు



తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 5: సెంట్రల్ బస్సు స్టేషన్‌లో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. బస్టాండులో నిత్యం 1.2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో భద్రతను మరింత పటిష్ఠం చేయడంలో భాగంగా పోలీసు విభాగం సహకారంతో బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటి వరకు ఉన్న కెమెరాల్లో పాడైనవాటిని తొలగించి కొత్తవి పెడుతున్నారు. అదనంగా రోజుల తరబడి రికార్డ్ చేసే దృశ్యాలను సేవ్ చేయడానికి చిప్ అమర్చారు. శ్రీహరి, శ్రీనివాస బస్టాండుల్లో ఆరు చొప్పున ఫేస్ రికగ్నిషన్ సర్వైలెన్స్ కెమెరాలు, ఏడుకొండల బస్టాండులో ఐదు కెమెరాలను అమర్చారు. మిగిలిన 13 ఫిక్స్‌డ్ కెమెరాలను తరచూ చోరీలు జరిగే, రద్దీ అధికంగా ఉండే కాణిపాకం, వెంకటగిరి, బెంగళూరు, నెల్లూరు, శ్రీకాళహస్తి, చెన్నై, తిరుమల ప్లాట్‌ఫామ్స్‌లో అమర్చనున్నారు.

నేత్రదానం చేయండి: కలెక్టర్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 5: మరణం తర్వాత మన కళ్లు మట్టిలో కలిసి పోకుండా వాటిని దానం చేస్తే ఇద్దరికి చూపు ప్రసాదించే అవకాశం దక్కుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం రుయాస్పత్రిలో నిర్వహించిన నేత్రదానంపై అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో శ్రీహరితో కలిసి ప్రారంభించారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు మాట్లాడుతూ.. నేత్రదానం చేయాలనుకునేవారు ఆస్పత్రిలోని నేత్ర బ్యాంకును లేదా 8500880126 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.అనంతరం వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి ఎస్వీ వైద్య కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, నేత్ర విభాగాధిపతి చలపతిరెడ్డి, ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగులకు అలిపిరి సమీపంలో ఇళ్ల స్థలాలివ్వాలి: కాంగ్రెస్

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 5: టీటీడీ ఉద్యోగులకు అలిపిరి సమీపంలో ఉన్న 150ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జూపార్కు వెళ్లే మార్గంలో ఉన్న దాదాపు 150 ఎకరాల స్థలాన్ని దేవలోక్ అనే ప్రైవేటు సంస్థకు 99 ఏళ్లకు టీటీడీ లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. దీనిని వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు ఇళ్లస్థలాలు కేటాయించాలన్నారు. లేకుంటే ఈనెల 9న కలెక్టరేట్ వద్ద కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ లీగల్‌సెల్ అధ్యక్షుడు రవి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయవాదుల సాయం



తిరుపతి (లీగల్), సెప్టెంబరు 5: విజయవాడ వరదబాధితులకు సాయం చేయాలని న్యాయవాదులకు తిరుపతి బార్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం సీనియర్ న్యాయవాది కె.ఎస్.శ్రీధర్, జూనియర్ న్యాయవాదులు కలిసి.. 15బస్తాలు బియ్యం, నిత్యావసర సరుకులు, మెడికల్ కిట్స్, బెడ్‌షీట్స్, దుస్తులను బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు టి.గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మర్డిన్‌లకు అందజేశారు.



విజయవాడలో స్వహస్త సేవలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): విజయవాడలో వరద బాధితులకు స్వహస్త సంస్థ ప్రతినిధులు సేవలందిస్తున్నారు. సుమారు 500 మందికి ఆహారం, నీళ్లు, పాలు గురువారం పంపిణీ చేశారు. చిన్నారులు పొదుపు చేసిన కొద్ది మొత్తాన్ని వరద బాధితులకు ఇచ్చేలా ప్రజల్లో చైతన్యం కల్గిస్తున్నారు. వినాయక ఉత్సవాలకు ఖర్చు చేయబోయే మొత్తంలో 50 శాతం వరద బాధితులకు అందించాలని కోరారు. ప్రతినిధులు సుకుమార్, పురుషోత్తం, శ్రీనివాసులు, వెంకటేష్, సత్యకీ, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

'శివాజీ విగ్రహం కూలడం విచారకరం'

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5: మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లా రాజ్‌కోట్‌లో ఆగస్టు 26వతేదీన ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిపోవడం విచారకరమని మరాఠా సంఘం జిల్లా అధ్యక్షుడు పవ్వార్ అన్నారావ్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్కడ వెంటనే నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాని కూడా ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేశారన్నారు.

'పార్వతీ పుత్ర- పర్యావరణ మిత్ర'కు స్పందన



మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు

తిరుపతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పార్వతీపుత్ర-పర్యావరణ మిత్ర కార్యక్రమం గురువారం తుడా కార్యాలయ ప్రాంగణంలో విద్యార్థులతో సందడిగా సాగింది. చిన్నారులు చిట్టి చేతులతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన తుడా కార్యదర్శి వెంకటనారాయణ, కార్పొరేషన్ ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డిలు ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, గుండాల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా పండగ జరుపుకుందాం

తిరుపతి(విద్య): వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా జరుపుకుందామని కలెక్టర్, పలువురు ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. 'పర్యావరణ హిత నిమజ్జనమే పరిపూర్ణ నిమజ్జనం' పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మదన్ మోహన్‌రెడ్డి తదితరులు వీటిని ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీ తదితరులు



స్విమ్స్‌లో.. - రుయాలో..

ఆస్పత్రుల్లో గణనాథుడి మండపాలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 5: వినాయక చవితి సందర్భంగా గణనాథుడిని కొలువుదీర్చడానికి స్విమ్స్, రుయాస్పత్రుల్లోనూ మండపాలను సిద్ధం చేశారు. స్విమ్స్‌లోని సిబ్బంది.. ఎన్టీఆర్ సర్కిల్ వెనుక వైపున, రుయాస్పత్రిలోని సిబ్బంది పారిశుధ్య కార్యాలయం ఆవరణలో మండపాలను ఏర్పాటు చేశారు. ఈ మండపాల్లో శుక్రవారం గణనాథుడిని కొలువుంచనున్నారు.

నిబంధనలు బేఖాతర్



తిలక్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న మండపం

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 5: తిరుపతిలో గణేష్ మండపాల ఏర్పాటులో కొందరు నిర్వాహకులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. తిలక్‌రోడ్డులోని నాలుగుకాళ్ల మండపం సమీపంలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపం ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉంది. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ రోడ్డుపై తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఇపుడీ మండపం వల్ల మరిన్ని ట్రాఫిక్ కష్టాలు తప్పవని స్థానికులు అంటున్నారు. దీనిపై పోలీసులు విచారించి.. ఈ మండపాన్ని మరోచోట ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 5: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.10వేల మద్యాన్ని తిరుపతి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు. ఎస్ఐ షేక్ షావలి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జనార్దన కాలనీకి చెందిన రియాజ్ రెండేళ్లుగా కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ నుంచి మద్యం అక్రమంగా తీసుకొచ్చి ఇంట్లో దాచిపెట్టి విక్రయిస్తున్నాడు. ముందుగా అందిన సమాచారంతో గురువారం ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ నరసింగప్ప పర్యవేక్షణలో సీఐ చిన్నగోవిందు నేతృత్వంలో ఎస్ఐ షేక్ షావలి, సిబ్బంది కలసి విద్యానగర్ పార్కు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. కర్ణాటక నుంచి బస్సులో మద్యాన్ని తీసుకొస్తుండగా రియాజ్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు 75, 750 మిల్లీలీటర్ల బాటిళ్లు 10, బీరు బాటిళ్లు మరో 15 స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.10,000 ఉంటుందని ఎస్ఐ చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఎస్వీయూలో స్కాలర్లకు ప్రత్యేక మెస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 5: ఎస్వీయూలో పీహెచ్‌డీ స్కాలర్లకు ప్రత్యేక మెస్ ఏర్పాటైంది. వర్సిటీలోని బి-మెస్‌ను స్కాలర్లకు భోజన సదుపాయం కల్పించేలా ఉన్నతాధికారులు గురువారం చర్యలు తీసుకున్నారు. మెస్‌ను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభించారు. ఇప్పటి వరకూ పీజీ విద్యార్థులతో కలిసి స్కాలర్లు భోజనం చేసేవారని తెలిపారు. వార్డెన్లు, సిబ్బంది, స్కాలర్లు పాల్గొన్నారు.

లోపాల్లేకుండా ఫొటో ఎలక్టోరల్ జాబితా రూపొందించాలి: కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 5: ఎటువంటి పొరపాట్లు, లోపాల్లేకుండా ఫొటో ఎలక్టోరల్ జాబితా తయారు చేయాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల అధికారులు, బీఎల్‌ఏలతో సమీక్షించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 ప్రకారం బీఎల్‌ఏలు ఇంటింటికీ వెళ్లి, జాబితాను పరిశీలించి లోపాలను గుర్తించాలన్నారు. అలాగే 2024 అక్టోబరు నాటికి 18 సంవత్సరాలు నిండబోతున్న వారిని గుర్తించి నూతన ఓటర్లుగా నమోదు చేయించాలని ఆదేశించారు. వచ్చేనెల 29వ తేదీ నాటికి ఎటువంటి లోపాలులేని ముసాయిదా జాబితా ప్రచురించాలని ఆదేశించారు. డీఆర్వో పెంచల కిషోర్, ఎస్డీసీ రామ్మోహన్, నరసింహులు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



తిరుపతిలో గురువారం జరిగిన జిల్లాస్థాయి గురు పూజోత్సవ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలందుకున్నారు. - తిరుపతి(విద్య)



నిర్మల, దేవరాజులు నాయుడు, మురళీ కృష్ణయ్య (తిరుపతి అర్బన్)



టీచర్లకు ఎమ్మెల్యే నాని అభినందన

పాకాల: మండలంలోని ఇరంగారిపల్లె ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీరంజని, ఎస్వీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు డి.బాలసుబ్రమణ్యం, నేలదానిపల్లె ప్రధానోపాధ్యాయురాలు పి.రూత్ పావని తిరుపతిలో ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఎమ్మెల్యే వీరికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.



జానకిరామ, నాగమల్లేశ్వరి, నాగేశ్వరయ్య, ప్రశాంతి (తిరుపతి రూరల్) - రమేష్ యాదవ్, సుగుణ, స్వయంప్రభ (ఆర్సీపురం)



లావణ్యలత, మల్లేశ్వరి, భారతమ్మ, రామ్మూర్తి (చంద్రగిరి) - తారకనాథ (చిన్నగొట్టిగల్లు) - అమరనాథ, రాజగోపాల్ (ఎర్రావారిపాలెం)

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 5: శెట్టిపల్లె విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు టౌన్ ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సమస్యలున్న విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బార్లపై పోలీసుల కొరడా

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 5: తిరుపతిలో గురువారం బార్లపై పోలీసులు కొరడా ఝుళిపించారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అధికంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలపై ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది టీములుగా విడిపోయి దాడులు చేశారు. నిబంధనలు అధిగమించి తెల్లవారు జామున మందు విక్రయించడం, అధికంగా వసూలు చేయడం గుర్తించారు. దీంతో గణేష్ బార్, యాలమూరి బార్ యజమానులు, క్యాషియర్లు, సప్లయర్లను అరెస్టు చేసి 41 నోటీసులు ఇచ్చి సొంత పూచీకత్తుపై విడుదల చేశామని సీఐ తెలిపారు.

నూతన సింథటిక్ టెన్నిస్ కోర్ట్ ప్రారంభం



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 5: ఎస్వీయూ పరిధిలోని ప్రకాశం భవన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సింతటిక్ టెన్నిస్ కోర్ట్‌ను గురువారం ఇన్‌చార్జి వీసీ అప్పారావు ప్రారంభించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, టీటీడీ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ రామ్‌కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం అమలుపై పరిశీలన



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆశిష్‌గుప్తా

తిరుపతి(విద్య), సెప్టెంబరు 5: జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు తీరు పరిశీలనకు మూడ్రోజుల పర్యటన నిమిత్తం భారత గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్ గుప్తా, జాయింట్ కమిషనర్ శివప్రసాద్ గురువారం రాత్రి తిరుపతికి వచ్చారు. కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర ఉపాధి అధికారులతో సమావేశమై పథకం అమలుపై సమీక్షించారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ జిల్లాలో చేపట్టిన వివిధ పనులను వివరించారు. శుక్ర, శని వారాల్లో వీరు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియో థెరపీతో ఎన్నో ప్రయోజనాలు

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 5: ఫిజియోథెరపీతో ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు పొందవచ్చని ఫిజియోథెరపిస్టు రేవతి అన్నారు. రాస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని నిర్వహించారు. రాస్ ప్రధా కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు, సీఐడీ విశ్రాంత డైరెక్టర్ ఎంవీఎస్ స్వామి పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

షార్‌లో ఘనంగా గురు పూజోత్సవం



సర్వేపల్లికి నివాళులు అర్పిస్తున్న షార్ డైరెక్టర్ తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5: శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో గురువారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. షార్‌లోని బ్రహ్మ ప్రకాష్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నై సైన్సు అండ్ టెక్నాలజీ సెంటర్ ఈడీ డాక్టర్ ఐకే లెనిన్ తమిల్ కోవన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వంలో విలువ కట్టలేనిది ఒక గురువు సేవలు మాత్రమేనని, గురు శిష్య పరంపర భావి తరాల్లో కొనసాగాలన్నారు ముందుగా ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహమ్మద్, కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, అంతరిక్ష కేంద్రీయ పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి

● మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేటటౌన్, సెప్టెంబరు5: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం గురుపూజోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రఫీ, చంద్రారెడ్డి, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

రూ.కోటితో తుమ్మూరు శ్మశానవాటిక ఆధునికీకరణ

నాయుడుపేట, సెప్టెంబరు 5: నాయుడుపేటలోని తుమ్మూరు హిందూ శ్మశానవాటిక ఆధునీకరణకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్ఎస్‌రెడ్డి, ఆయన సోదరుడు సన్నారెడ్డి రాజారెడ్డి కోటి రూపాయలు అందజేయనున్నట్లు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. తుమ్మూరు శ్మశానవాటికను టీడీపీ నాయకులతో కలసి గురువారం పరిశీలించారు. శ్మశానవాటికను నాయుడుపేట స్వర్గధామ తరహాలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 5 : ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం, కూచివాడ పొలాల్లో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ (వరి, వేరుశనగ), డీఆర్‌పీ మోడల్, పీఎండీసీ వేసిన పొలాలను సందర్శించారు.

జీవో నంబరు 21ని రద్దు చేయాలి

గూడూరు, సెప్టెంబరు 5: మోటారు రంగ కార్మికులకు నష్టం కలిగించే జీవో నంబరు 21ని రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. గురువారం స్థానిక రవాణ శాఖ కార్యాలయంలో ఎంవీఐ జకీర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రవాణశాఖ జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటీకరణ కాకుండా ప్రభుత్వం ద్వారానే యదావిధిగా కొనసాగించాలన్నారు. అర్హత కలిగిన డ్రైవర్లకు డ్రైవర్ల సాధికార సంస్థను ఏర్పాటు చేసి రూ. 10వేలు ఆర్థికసాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అల్లాతాత గంధోత్సవానికి జెండా స్థాపన



తడ, సెప్టెంబరు 5 : వేనాడులో వెలసిన దావూద్‌షా వలి అల్లాతాత 29వ గంధోత్సవానికి ప్రారంభంగా జెండా స్థాపన కార్యక్రమం జరిగింది. బుధవారం రాత్రి గ్రామ పెద్దలు సుదర్శన్ మొదలియార్‌తోపాటు ముస్లిం మత పెద్దలు బాబాకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలో జెండా స్థాపన (నిషాన్) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. 10వ తేదీ అర్ధరాత్రి గంధోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామపెద్ద సుదర్శన్‌మొదలియార్ తెలిపారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి

గూడూరు, సెప్టెంబరు 5: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు అన్నారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ధరలు అధికంగా పెరిగాయన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, బాలకృష్ణ, శశి, చంద్రయ్య, నారాయణ, సీవీఆర్‌కుమార్, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డులు

జిల్లాస్థాయి గురు పూజోత్సవ కార్యక్రమం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో గురువారం జరిగింది. కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పలువురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.



మధుసూదన్ (హెచ్‌ఎం, అన్నమేడు, నాయుడుపేట), ఎ.చెన్నమ్మ (ఎస్జీటీ, అక్కసముద్రం, బాలాయపల్లి), పి. శ్రీనివాసులు (స్కూల్ అసిస్టెంట్, చిల్లకూరు), టి. జ్యోతి (ఎస్జీటీ, నాగవోలు, డక్కిలి), వి. శ్రీనివాసులు (ఎస్జీటీ, తల్లంపాడు, దొరవారి సత్రం), కె. శివకళ (ఎస్జీటీ, అయ్యవారిపాళెం, గూడూరు)



మంజుల (ఎస్జీటీ, టీఎన్‌పాళెం, కోట), షఫీవుల్లా (ఎస్ఏ, అన్నమేడు), సుబ్బారావు (పీజీటీ, నాయుడుపేట), శంకరయ్య (ఎస్జీటీ, అత్తపాళెం),శీనివాసులు (ఎస్ఏ, చిల్లమానుచేను, ఓజిలి), జె. దొరతి వయోల (ఎస్జీటీ, కానూరు రాజుపాళెం, పెళ్లకూరు), వి. బాలసుబ్రహ్మణ్యం (ఎస్జీటీ, ఎడపూడి, పెళ్లకూరు)



చంద్రజిత్ యాదవ్ (హెచ్‌ఎం, కోటాపోలూరు, సూళ్లూరుపేట), శంకరయ్య (ఎస్జీటీ, మర్లపల్లి, నాయుడుపేట), మాల్యాద్రి (ఎస్జీటీ, దుగరాజపట్నం), ఐ.మాలిని (ఎస్జీటీ, వెంకటరెడ్డిపాళెం, వాకాడు),బి.సత్యనారాయణ (ఎస్జీటీ, పారవోలు, వెంకటగిరి), సాయిరాం (ఎస్జీటీ, మొగళ్లగుంట, వెంకటగిరి)

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

తడ, సెప్టెంబరు5: పులికాట్ సరస్సులో పక్షుల అభయారణ్యాన్ని కాపాడడం, దాంతోపాటు మత్స్యకారుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడమే ప్రస్తుత కమిటీ లక్ష్యమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో పులికాట్ పరిరక్షణపై ఎకో సెంసిట్యూ జోన్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సభ్యులుగా పాండిచ్చేరి యూనివర్శిటీ ఎకో ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భూపేష్‌గుప్తా, ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రాజశేఖర్, డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త జ్యోతి, సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో శామ్యూల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తుడా ప్లానింగ్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. పులికాట్ సరస్సుకు పూడిరాయ దొరువు వద్ద పూడిక తీయించడం ద్వారా అటు మత్స్యకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని కలెక్టర్, కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. సాగరమాల పథకం ద్వారా పూడికతీతకు నిధులు విడుదలైన వెంటనే ఆ పనులు చేస్తామన్నారు. పులికాట్ సరస్సులో పర్యావరణం దెబ్బతినకుండా అభయారణ్యం పెంపొందిస్తూ, ఇందుకు సమాంతరంగా మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిసర ప్రాంతాలలో రహదారులు, మౌళిక సదుపాయాల కల్పన కమిటీ ఆమోదంతో ముందుకు వెళతామన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఏకో టూరిజం ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, వైల్డ్ లైఫ్ డీఎఫ్‌వో శామ్యూల్, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ కమల ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, మత్స్యకార నాయకుడు రఘురెడ్డి, కోదండం, రమేష్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వరద బాధితుల సహాయార్థం విరాళం

గూడూరు, సెప్టెంబరు5:స్థానిక ముత్యాలపేటలోని పీఆర్ క్లబ్‌లో గురువారం క్లబ్ సభ్యులు వరదల్లో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధికి రూ.1.05లక్షల చెక్కును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, చదలవాడ హరిప్రసాద్, కోడూరు మీరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, మస్తాన్‌నాయుడు, విజయ్‌కుమార్, సోమిశెట్టి చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర్లురాజు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కాస్మోపాలిటిన్ క్లబ్‌లో క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సీఎం సహాయనిధికి రూ. 50వేలు చెక్కును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీహరి, సురేంద్రనాథ్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, బత్తిన ప్రణీత్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న పీఆర్ క్లబ్ సభ్యులు



వరద బాధితులకు సాయం చేద్దాం

చిల్లకూరు మండలం ఏరూరు సమీపంలోని సముద్రతీరప్రాంతంలో గురువారం సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ హెల్ప్ ఫ్లడ్ విక్టిమ్స్ విజయవాడ అనే నినాదంతో ఓ సైకతశిల్పాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ వరదబాధితులకు ప్రతిఒక్కరూ సాయం చేయాలని ఆకాంక్షిస్తూ ఈ శిల్పాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా విరాళాలు అందించి వరద బాధితులను ఆదుకోవాలన్నారు. - చిల్లకూరు

పొన్నూరులోని వెండి దుకాణంలో భారీ చోరీ

గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డ ఇద్దరు నిందితులు ● పరారీలో మరో ఇద్దరు ● కారుతోపాటు రూ.30 లక్షల ఆభరణాల స్వాధీనం



పట్టుబడిన నిందితులు, పొన్నూరు పోలీసులకు ఆభరణాలు అప్పగిస్తున్న చంద్రగిరి పోలీసులు

చంద్రగిరి, సెప్టెంబరు 5: గుంటూరు సమీపంలోని పొన్నూరు పట్టణంలో ఉన్న ఓ వెండి దుకాణంలో భారీ చోరీ జరిగింది. వీరిలో ఇద్దరు నిందితులను గాదంకి టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారవగా, కారుతోపాటు రూ.30లక్షల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నూరు పట్టణం గాంధీబొమ్మ సెంటర్‌కు సమీపంలోని తోటలమ్మ గుడి పక్కనే వెండి, బంగారు ఆభరణాలు విక్రయించే ధనలక్ష్మీ జ్యూవెలర్స్ ఉంది. బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఓ కారులో కొందరు వ్యక్తులు వచ్చి దుకాణం షట్టర్ పగలగొట్టి లోనికి చొరబడ్డారు. అనంతరం ఆభరణాలను మూటలు కట్టి కారులో వేస్తుండగా, ఆ వీధిలో వినాయక చవితి పండుగకు పందిళ్లు వేస్తున్న కేజీఎన్ యూత్ సభ్యులు గమనించారు. యువకులు దుకాణం వద్దకు వెళ్లడంతో దుండగులు పారిపోయేందుకు యత్నించారు. యువకులు ధైర్యంచేసి వెంటాడి రతన్ సింగ్ అనే దుండగుడిని పట్టుకున్నారు. ఇతడిని విడిపించడానికి ఇద్దరు దుండగులు కారు దిగి వచ్చారు. యువకులపై దాడి చేయగా, వారు ప్రతిఘటించడంతో పరారయ్యారు. సమాచారం అందుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టుబడ్డ రతన్ సింగ్‌ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిచ్చిన సమాచారంతో కారు దిగిన ఇద్దరు నిందితులను తెనాలిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల సెల్‌ఫోన్ ఆధారంగా కారులో పరారైనవారు బెంగళూరుకు వెళుతున్నట్లు గుర్తించి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో వెళ్లి గాదంకి టోల్‌ప్లాజా వద్ద నిఘా ఉంచారు. నిందితులు ప్రయాణిస్తున్న కారు గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో రాగానే టోల్‌ప్లాజా సిబ్బందితో కలిసి వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. కారును పరిశీలించగా, రూ.30 లక్షల విలువైన వెండి ఆభరణాలు కనిపించాయి. కారుతోపాటు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను, కారు, ఆభరణాలను చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పొన్నూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు గురువారం రాత్రి 10 గంటల సమయానికి చంద్రగిరికి చేరుకున్నారు. వీరికి ఇద్దరు నిందితులు, ఆభరణాలు, కారును చంద్రగిరి పోలీసులు అప్పగించారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల్లో
సామాన్య భక్తులకే పెద్దపీట



● శనివారం వేకువన 3 గంటల నుంచే దర్శనం
● కాణిపాక ఆలయ ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 5: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకే పెద్దపీట వేయనున్నట్లు ఆలయ ఈవో గురుప్రసాద్ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో 14 గ్రామాలకు చెందిన ఉభయదారులదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. వినాయక చవితి రోజున స్వామి దర్శనానికి 80 వేల మంది భక్తులు రావచ్చని అంచనా వేశామన్నారు. ఆ రోజున వీఐపీలు, సామాన్య భక్తులందరికీ ఒకేలాగా స్వామి దర్శనం కల్పిస్తామని స్పష్టం చేశారు. శనివారం వేకువ జామున 2 గంటలకు ఉభయదారుడు గాలిమునస్వామినాయుడు ఆధ్వర్యంలో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించి స్వామి అలంకారం పూర్తి చేశాక 3 గంటల నుంచి భక్తులను స్వామి దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపారు. స్వామి దర్శనం కోసం ఉచితం, రూ.100, రూ.150 దర్శన క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు ఈవో వివరించారు. భక్తుల సౌకర్యార్థం చవితి రోజున భక్తులకు ఉదయం 9 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లోనూ నిత్యాన్నదానాన్ని నిర్వహిస్తామన్నారు. స్వామి దర్శనార్థం విచ్చేసే చంటిపిల్లల తల్లులు, వృద్ధులు, ప్రత్యేక అవసరాలున్న వారికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయం వద్ద ఎక్కడా భక్తులు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందించడానికి డాక్టర్‌ను, అంబులెన్సును అందుబాటులో ఉంచుతామన్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు. భక్తుల కోసం లక్ష లడ్డూలను సిద్ధం చేశామన్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు భక్తులు విచ్చేయగానే వారు దగ్గర్లోని లడ్డూ కౌంటర్లలో కొనుగోలు చేసుకోవాలన్నారు. ఆలయం వద్ద అవసరమైన సీసీ కెమరాలను అమర్చామన్నారు. భక్తులకు అవసరమైనన్ని బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లను శుక్రవారానికి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆలయం వద్ద పోలీసులు కమాండ్ కంట్రోల్లో సీసీ టీవీలను పర్యవేక్షిస్తూ భద్రత కల్పించాలని ఆయన సూచించారు.

గళం విప్పినా ప్రయోజనం ఏముంది?

● ఎమ్మెల్యేల ఆదేశాలను పట్టించుకోని అధికారులు

● గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలు నేటికీ పరిష్కారం కాని వైనం ● నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేలు పలు సమస్యలను ప్రస్తావించారు. రెండు నెలలైనా 90 శాతానికిపైగా పరిష్కారం కాలేదు. వీరి మాటలను అధికారులు పట్టించుకోవడంలేదు. అలాంటప్పుడు జడ్పీ సమావేశాల్లో గళం విప్పినా ప్రయోజనం ఏముందన్నది ఎమ్మెల్యేల ప్రశ్న. శుక్రవారం జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారులు దీనికి ఏం జవాబు చెబుతారో మరి. ఈసారైనా సభ్యులు ప్రస్తావించే సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

- చిత్తూరు రూరల్

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జూలై 3వ తేదీన జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, సమస్యలపై గళం విప్పిన తీరు చూసి అధికారులకు చమటలు పట్టాయి. తర్వాత సమావేశానికి సమస్యలు పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఫలితం లేదు. దీన్ని బట్టి అధికారులు ఎమ్మెల్యేలకు ఎంత విలువనిస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలైనా ఇంకా చాలా శాఖల్లో అధికారులు, సిబ్బంది బదిలీలు జరగలేదు. ఇప్పుడున్న వారంతా వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన వారే. దీంతో ఎమ్మెల్యేలు చెప్పినా అధికారులు వినడం లేదనేది స్పష్టంగా తెలుస్తోంది. ఆ మధ్య పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సిఫార్సు లేఖను డీఈవో దేవరాజు పట్టించుకోకుండా, దాన్ని తెచ్చినవారికి కూడా షోకాజ్ ఇవ్వడం సంచలనంగా మారింది. అలాగే జిల్లాలో చాలాచోట్ల ఎమ్మెల్యేలు అడిగిన తహసీల్దార్లు, ఎస్ఐ, సీఐలకు పోస్టింగులు ఇవ్వలేదు. దీంతో మా పనులు కావడం లేదని ఎమ్మెల్యేలు ఆవేదన చెందుతున్నారు. అధికారంలో ఉండీ ఉపయోగం లేదంటున్నారు.



కొత్త అధికారులు వస్తేనే?

గత సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించిన సమస్యలు పరిష్కారం అవ్వకపోవడానికి ప్రధాన కారణం బదిలీలు జరగకపోవడమేనని తెలుస్తోంది. కొత్త టీమ్ వస్తే పనులు చురుగ్గా జరుగుతాయని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఆగస్టు 31 నాటికి బదిలీలు పూర్తి చేస్తారనుకుంటే పింఛన్ల పంపిణీ కోసం సెప్టెంబరు 15 వరకు వాయిదా వేశారు. ఇప్పుడు బదిలీల కన్నా విజయవాడ వరద బాధితులను ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది. దీంతో సెప్టెంబరు 15 నాటికీ బదిలీలు పూర్తి అవ్వడం అనుమానమే.

గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలివీ

● జిల్లాలో పలు శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలన్నీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అనుచరులకే కేటాయించారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులకు ఫిర్యాదు చేశారు. తుమ్మలగుంట చెరువు అభివృద్ధి పేరిట అక్రమంగా పార్కులు, కట్టడాలు నిర్మించడం వల్ల గతంలో కురిసిన వర్షాలకు తిరుపతి నగరం సగం మునిగిపోయిందన్నారు. ఈ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. దీనిపై చర్యలు తీసుకోకుంటే వరద సమయాల్లో తిరుపతి మరో విజయవాడలా మారే అవకాశం ఉంది.

● 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించలేదని గత సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల ప్రస్తావించారు. వెంటనే బిల్లులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించినా వారు పట్టించుకోలేదు. కేవలం టీడీపీ వారనే కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు పూర్తయినా బిల్లులు చెల్లించలేదు.

● అర్హత లేకున్నా తమ నియోజకవర్గాల్లో అనేక మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు వికలాంగ, డీఎంహెచ్‌వో పింఛన్లు పొందుతున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాటి సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పలు ఉదాహరణలు చూపారు. ఇంకా జిల్లాలో చాలామంది అనర్హులకు పింఛన్లు అందుతూనే ఉన్నాయి.





ఎమ్మెల్యేల నుంచి అవార్డు అందుకుంటున్న భువనేశ్వరి(పుత్తూరు) - బాలకృష్ణారెడ్డి(నారాయణవనం) - బావాజాన్(రేణిగుంట) - జీపీ చలం (శ్రీకాళహస్తి) - దేవేంద్ర(బీఎన్ కండ్రిగ) - దేవికమ్మ(నారాయణవనం) - గిరిప్రకాష్(పిచ్చాటూరు) - గోపీకృష్ణ(పుత్తూరు) - ఎం గోపీ(పుత్తూరు) - హరినాథ్(పుత్తూరు) - కేశవులు (పుత్తూరు) - కృష్ణయ్య(సత్యవేడు) - లక్ష్మయ్య(బిఎన్‌కండ్రిగ) - లక్ష్మీదేవసేన(రేణిగుంట) - మదన మునయార్ (పిచ్చాటూరు) - మాదవయ్య(వరదయ్యపాళెం)

విద్యారంగంలో ఉపాధ్యాయులు అందించిన ఉత్తమ సేవలకు పురస్కారాలు లభించాయి. శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లోని పలువురు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.



మునీశ్వరరెడ్డి(తొట్టంబేడు) - మురళీకృష్ణ(వరదయ్యపాళెం) - మురళీమోహన్‌ప్రసాద్ (తొట్టంబేడు) - నరసింహయ్య (శ్రీకాళహస్తి) - ప్రేమ్‌కుమార్ (సత్యవేడు) - రమేష్‌బాబు (పిచ్చాటూరు) - రమేష్ (నారాయణవనం) - రవిశేఖర్‌రెడ్డి (వడమాలపేట) - సుబ్బరాయన్ (పుత్తూరు) - శ్యామలత (నారాయణవనం) - వల్లి(నారాయణవనం) - వెంకటేశ్వర్లు(నాగులాపురం) - విజయ(బీఎన్‌కండ్రిగ) - మోహన్‌బాబు (కేవీబీపురం) - మాధవీలత(శ్రీకాళహస్తి) - మధుసూదనరాజు (వడమాలపేట)

ఆగమోక్తంగా గురు దక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేధో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వైదిక క్రతువులు, అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రసాయన ఎరువులతో భూసారానికి చేటు



మాట్లాడుతున్న వ్యవసాయాశాఖాధికారులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: భూములు ఆరోగ్యంగా ఉంటేనే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అన్నారు. తొట్టంబేడు మండలం చిట్టత్తూరు రైతులకు గురువారం ఆయన శిక్షణ ఇచ్చారు. విపరీతంగా రసాయనాలు వాడకం వలన భూమి సారం కోల్పోతోందన్నారు. సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట, జీవన ఎరువులు వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచవచ్చన్నారు. డివిజనల్ ఉద్యాన అధికారి పుష్పలత ఆయిల్‌పామ్ సాగు గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ ఉద్యాన సహాయకురాలు అహంతి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించాలని విద్యార్థుల ర్యాలీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన విభాగం చైర్మన్ షేక్ అజారుద్దీన్ మాట్లాడుతూ మట్టి వినాయకుడిని నిమజ్జనం చేయడం వలన భూమిలో త్వరగా కలిసిపోయి పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గైడ్ కమిషనర్ పార్వతి, స్కౌట్ మాస్టర్లు ధనుష్, సుబ్రహ్మణ్యం, కెప్టెన్లు సరిత, పద్మావతి, సులోచన, పీడీ సరోజ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార మాసోత్సవాల్లో అధికారులు,సిబ్బంది

వరదయ్యపాళెం, సెప్టెంబరు 5: పౌష్టికాహారంతోనే చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, సర్పంచ్ దీప అన్నారు. జీఆర్ దరఖాస్తు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని గర్భవతులు,బాలింతలు తీసుకుని రక్తహీనత రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 5: మండల కేంద్రంలో ప్రధాన రహదారిలో ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నింబంధనలు పాటించాలని ఏఎస్ఐ శివకుమార్,పోలీస్ సిబ్బంది కోరారు. ఆటో డ్రైవర్లతో గురువారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ దగ్గర లైసెన్సుతో పాటు అవసరమైన పత్రాలు ఉండాలన్నారు. మద్యం తాగి నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

తపస్యలో ఘనంగా గురుపూజోత్సవం



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

రేణిగుంట, సెప్టెంబరు 5: పట్టణంలోని తపస్య పాఠశాలలో గురువారం ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఇక్కడి ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో పాఠశాల అధినేత విక్రమ్‌శాలి, డైరెక్టర్ అనూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రేపు నవసంధి వినాయకులకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నాలుగు మాడవీధుల్లోని నవసంది వినాయకులకు ముక్కంటి సారె సమర్పించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. వినాయక చవితి పురస్కరించుకుని శనివారం ఉదయం 8గంటలకు ముక్కంటి ఆలయం నుంచి మేళతాళాల నడుమ నవసంది ఆలయాలకు ముక్కంటి సారె ఇవ్వనున్నట్లు తెలిపారు.

13 నుంచి పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో భక్తుల, సిబ్బంది వల్ల ఏదైనా తెలియక తప్పులు జరిగి ఉంటే అందుకు పరిహారంగా ఏటా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

ఉపకార వేతనాల గడువు పెంపు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ కింద పనిచేస్తున్న బీడీ కార్మికుల కుటుంబాల విద్యార్థులకు ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పెంచారు. బీడీ కార్మికుల వైద్యాధికారి పవన్ కుమార్ ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 30 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. అర్హులైన వారు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డివైడర్ ఢీకొని యువకుడికి గాయాలు



108 వాహనంలో క్షతగాత్రుడు

రేణిగుంట, సెప్టెంబరు 5: డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు గాయపడ్డాడు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన శివకుమార్ ఆటోనగర్‌లో స్కూటర్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. గురువారం మద్యం తాగి అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని నడపడంతో తిరుపతి-రేణిగుంట మార్గంలో ఈసీఐఎల్ వద్దఅదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. తలకు తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసులు చేరుకుని రుయాకు 108 వాహనంలో తరలించారు.

విద్యుత్ సరఫరాపై అవగాహన

కేవీబీపురం, సెప్టెంబరు 5: కేవీబీపురం, రాగిగుంట, కోటమంగాపురం గ్రామాల్లోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం రైతులకు విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు అవగాహన కల్పించారు. ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు సమయంలో ఏర్పడే అంతరాయానికి రైతులు, ప్రజలు సహకరించాలన్నారు. సమస్యలు ఉంటే విద్యుత్‌శాఖ సిబ్బంది దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో శ్రీకాళహస్తి రూరల్ ఏడీ పరిశుద్ధరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మర్రిమందలో పారిశుధ్యం అధ్వానం



మర్రిమందలో వీధిలో చేరిన మురుగునీరు

ఏర్పేడు, సెప్టెంబరు 5: మండలంలోని మర్రిమంద దళితవాడలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కాలువలు లేకపోవడంతో మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తోంది. దీంతో విషజ్వరాల బారిన పడి ప్రజలు అల్లాడుతున్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. దళితవాడలో 100 కుటుంబాలుంటున్నాయి. ఒక్క వీధిలో కూడా మురుగుకాలువ లేదు. దీంతో మురుగునీరు ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగపరచాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పాఠశాలల్లో సర్వేపల్లికి నివాళులు





శ్రీకాళహస్తిలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పిస్తున్న చంద్రప్ప తదితరులు-వరదయ్యపాళెంలో ఉపాధ్యాయులకు సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు. ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల్లో కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. 84 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఐదుగురు విశ్రాంత ఉపాధ్యాయులను ఏపీ విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప ఏపీ ఎన్జీవోస్ నాయకుడు చెంచురత్నంయాదవ్, వెంకయ్య పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తన కార్యాలయంలో ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పసల రమణయ్య, స్వర్ణమూర్తి, నాగేశ్వరరావు, వాసుదేవరావు, బాలిశెట్టి మురళి, చిలకా రంగయ్య, మునిరాజా, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **వరదయ్యపాళెం:** మండల కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాలు, లోకా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు సరస్వతి, గున్నయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు అంబూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ నందకిషోర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. **బుచ్చినాయుడుకండ్రిగ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లివెట్టు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయి వరకు ఎదిగిన రాధాకృష్ణన్ జీవన ప్రస్థానాన్ని ఉపాధ్యాయులు వివరించారు. వరదయ్యపాళెం ఎంపీడీవో ప్రసాద్ తనకు విద్య నేర్పిన విశ్రాంత ఉపాధ్యాయురాలు జయశ్రీని సన్మానించారు. **ఏర్పేడు:** పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రమేష్‌నాథ్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. బండారుపల్లి ఉన్నత పాఠశాల, పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. **రేణిగుంట:** అనాసంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాదమునిరెడ్డి సన్మానించారు. హెచ్ఎం సునీత గౌడ్, పాల్గొన్నారు. **పిచ్చాటూరు:**పులియంగుంట జడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయులనుశాలువలతో సత్కరించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పరందామాచారి పాల్గొన్నారు. మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు అందుకుంటున్న గిరిప్రకాష్, రమేష్‌బాబు, మదన మునస్వామ్‌లకు పలువురు అభినందనలు తెలిపారు.**రేణిగుంట:** ఎంఈఓ కార్యాలయంలో 9మంది టీచర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఇందిరాదేవి, రంగనాథయ్య, ఆశ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జూనియన్ రాజు తదితరులు పాల్గొన్నారు. **సత్యవేడు:** సత్యవేడు బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం భారతి ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు పాదపూజ చేశారు.





బండారుపల్లిలో ఉపాధ్యాయులకు సన్మానం- బీఎన్‌కండ్రిగ పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళుల్పరిస్తున్న ఉపాధ్యాయులు

గిరిపుత్రులకు పీఎంయూ చేయూత



ఆధార్‌కార్డులతో గిరిజనులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: గిరిపుత్రులకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పీఎంయూ(ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్) పూర్తిస్థాయిలో చేయూతనిస్తోంది. ఎర్రగుడిపాడు ఎస్టీకాలనీలో 55 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. ఆధార్, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జాబ్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతాలు, ఓటరు గుర్తింపు కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. పీఎంయూ సిబ్బంది గుర్తించి 141మందికి ఆధార్ నమోదు చేయించింది. గురువారం పంపిణీ చేసింది. గిరిజన సంక్షేమశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్‌కుమార్, జాన్ పాల్గొన్నారు.

మహిళా హాస్టల్ తీరుపై న్యాయమూర్తి అసంతృప్తి



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: తెలుగుగంగ కాలనీలోని మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌ను గురువారం శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని పరిసరాలు, వంట గది, స్టోర్‌రూమ్ తదితర ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. హాస్టల్‌లో రెండు బాత్‌రూమ్‌లకే తలుపులు ఉండటం గమనించారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మెను ప్రకారం భోజనం పెట్టడంలేదన్నారు. అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం కోర్టులో హాజరు కావాలని వార్డెన్‌ను ఆదేశించారు. న్యాయవాదులు, పారా లీగల్‌వాలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: శ్రీకాళహస్తి పట్టణంలో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు గురువారం డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. పట్టణ వీధుల్లో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరసింహమూర్తిమాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు, వన్‌వే ట్రాఫిక్, వన్‌సైడ్ పార్కింగ్, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, మాదక ద్రవ్యాల నిషేధం, వినాయక చవితి బలవంతపు చందాలు, ప్రజలకు అసౌకర్యంగా రోడ్లపై పందిళ్లు వేయడం వంటివాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు గోపి, వెంకటేశ్వర్లు, రవినాయక్ తిమ్మయ్య, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలంపై ఆరోపణల్లో నిజాలు నిగ్గుతేల్చాలి

కేవీబీపురం, సెప్టెంబరు 5: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా దర్యాప్తు చేసి నిజాలు నిగ్గు తేల్చాలని మండల టీడీపీ నాయకుడు మల్లికార్జున రెడ్డి అన్నారు.కేవీబీపురంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుట్రపూరితంగా మహిళను అడ్డంపెట్టి ఎమ్మెల్యేను అభాసుపాలు చేశారని వాపోయారు. టీడీపీలోనే కొంతమంది వైసీపీ నాయకులతో కుమ్మక్కై ఆదిమూలాన్ని ఇరికించారన్నారు. జయరామిరెడ్డి, జనసేన థామస్, అంబేడ్కర సంఘ నాయకుడు రవి, కేశవులునాయుడు, బాలాజీ, మునిరాజా, వెంకటేశు, సతీష్, పాల్గొన్నారు.

స్వగ్రామంలో మద్దతుగా నిరసన

సత్యవేడు, సెప్టెంబరు 5: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలానికి మద్దతుగా ఎమ్మెల్యే స్వగ్రామం నారాయణవనం మండలం భీమునిచెరువులో గ్రామస్థులు స్థానిక సచివాలయం వద్దకు చేరుకుని, ఆయనపై ఆరోపణలు చేసిన మహిళా నాయకురాలి దిష్టిబొమ్మను కాల్చి, నిరసన తెలిపారు. 45 ఏళ్ల రాజకీయంలో చిన్న మచ్చకూడాలేని వ్యక్తి ఆదిమూలం అంటూ నినదించారు. ఆదిమూలంపై మాజీమంత్రి పెద్దిరెడ్డితో పాటు టీడీపీ నాయకలు కుట్రలు పన్నారని ఆరోపించారు.

రాజీనామా చేయాలి: సీపీఎం

సత్యవేడు, సెప్టెంబరు 5: లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలకు అండగా ఉండాల్సిన వ్యక్తి నైతిక విలువలు కోల్పోయి మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడడం దారుణం అన్నారు.

అన్నదానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు, వీర మహిళలు హాజరై సుమారు 300మంది అన్నదానం చేశారు.







వినాయక చవితి సందడి

శ్రీకాళహస్తిలో వినాయక చవితి సందడి మొదలైంది. పట్టణవ్యాప్తంగా వారం రోజుల నుంచి వినాయక విగ్రహాలను కొలువు దీర్చేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం పానగల్ ప్రాంతంలో వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. భారీ వినాయక ప్రతిమలను వాహనాల్లో తరలించారు. క్రేన్లను సైతం సిద్ధం చేశారు. వాడవాడలా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుద్దీపాలంకరణలు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోపక్క విగ్రహాలకు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చారు. - శ్రీకాళహస్తి

పుత్తూరు వార్తలు

ముందస్తు చవితి వేడుకలు

వడమాలపేట, సెప్టెంబర్ 5: వినాయక చవితి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ముందస్తుగా విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. గురువారం ఉదయం విగ్రహానికి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. తహసీల్దార్ జరీనా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, మురళీరెడ్డి, వెంకటయ్య, హేమావతి, మునిశేఖర్, పెద్దబ్బరాజు,ఉమాపతి రావ్, అంజయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధమైన విగ్రహాలు

రాచపాలెం, మహాలక్ష్మీపురం, కేఎం అగ్రహారం వద్ద వినాయక విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. 4 అడుగుల నుంచి 40 అడుగుల వరకు విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని విగ్రహాల తయారీదారులు తెలిపారు. రూ.3 వేల నుంచి 50 వేల వరకూ విలువైన ప్రతిమలు అమ్మకానికి ఉంచామన్నారు.

సమాజ అభివృద్ధిలో గురువులదే కీలక బాధ్యత

ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే భానుప్రకాష్



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 5: సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులది గురుతర బాధ్యతత అని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంతో ఉపాధ్యాయులు చాలా కీలకమన్నారు. సామాజికంగా ఎదుగుదలకు వారే కారణమన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించి, అవార్డులు అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, మాజీ ఎంపీపీ లు డిఎన్.ఎలుమలై, గంజీ మాధవయ్య, ఒడల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరరావు పూల మాలలు వేసి, ఘనంగా నివాలులు అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య, అధ్యాపకులు కృష్ణయ్య, నాగేశ్వరరావు, వెంకటేశన్, రఘురామన్, వరలక్ష్మి, సావిత్రి, సుజన, శ్రీనివాసులు, జేకేసీ మెంటర్ కిషోర్ పాల్గొన్నారు. **నారాయణవనం:** ఎంఈవో కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. డీవైఈవో ప్రభాకర్‌రాజు, ఏఎస్‌పి సారథి, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.